# ప్రణయాన్వేషి

రచన ధనికొండ

లోకం తనను చూసి అకారణంగా నవ్వుతుంది. తను అసమర్థుడని కాదు; విజ్ఞానం లేనివాడని కాదు. నిష్ప్రయోజకుడని కాదు......ముప్ఫై రెండేళ్ళ బ్రహ్మచారని !

నిజానికి — తను రెండొందల జీతం మీద బాంకు ఏజెంట్ పని సంపాయించాడంటే — అదంతా తన ప్రతిభనే చెప్పాలి. మొదట ముప్ఫై రూపాయల జీతం మీద జేరి, తన పనితనంవల్లనే అధికార్ల మన్ననల్ని అందుకుంటూ, చివరకు యీ పెద్ద స్థానానికి ఎగబాకాడు. అంతే కాదు — ఇంకా ముందుకు సాగిపొయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు. తనకు రికమన్డేషన్లు లేవని తనెప్పుడూ బాధపడలేదు. ప్రతిభ అంటూవుంటే ఏనాటికైనా అదే తగిన ప్రతిఫలాన్ని ముట్టచెప్తుందని అతనికి గట్టినమ్మకం. అతని జీవితంలో మొట్టమొదటినుంచీ యీ సత్యం నిరూపింపబడుతూనే వుంది.

ఎంతో మంది మిత్రులు చెప్పిచూశారు. పెళ్ళాడమని బతిమాలారుకూడాను. కాని ఎప్పటికప్పుడే 'చూద్దాంలే' అనేవాడు. ఇప్పుడే ఏంతొందరలే అని కొంత కాలమూ, అశ్రద్ధవల్ల మరి కొంత కాలమూ, ఇతరపనుల తొందరవల్ల ఇంకొంత కాలమూ గడిచిపోయింది. తనకు పెళ్ళంటే అయిష్టమని కాదు; జీవితాంతం వరకూ ఇలా గేవుండిపోదామనీ కాదు...నిజానికి తనకు నచ్చిన కన్యలు బహు తక్కువ. నచ్చినవాళ్ళ విషయం తనెప్పుడూ గట్టి ప్రయత్నం చెయ్యలేదు. ప్రయత్నిస్తే అప్పటి తన హీనస్థితిలో (అప్పటి తనస్థితి హీనమైందేనని తన నమ్మకం) తనకు ఇష్టమున్న సంబంధం కుదిరే అవకాశం లేదని ఊరుకున్నాడు. యీవిధంగా రెండేళ్ళ క్రితంవరకూ జీవితం ఒంటరితనంతోనే గడిచిపోయింది... కాని తను భార్య అవకాశాల్ని గుర్తించక పోలేదు.

బ్రహ్మచారిగా జీవితాన్ని గడిపేందుకు మొదటినుంచీ అలవాటుపడివున్నా యవ్వనదశారంభంనుంచీ ఒంటరి జీవితంలోని దుర్భరతను గ్రహిస్తూనే వచ్చాడు. ఆఫీసుపనితో అలసిపోయి ఇంటికివొచ్చిన

తనను నవ్వుతూ ఆహ్వానించే ఒక భార్య ఉంటే యెంతో బాగుండు ననిపించేది. కాని తన జీవితానికి అంత అదృష్టం పడుతుందని తెలుచుకునే అర్హతకూడా తనకు లేదని ఒక ఊహ అతన్ని చాలా కాలంగా నిరుత్సాహపరిచింది. మొదటినుంచీ తనకు 'నా' అనేవాళ్ళు లేరు. వారాలు చేసుకుంటూ స్కాలర్‌షిప్స్‌మీద కష్టపడి చదువుకున్నాడు. చదువు సంధ్యలమీద ధ్యాస, జీవితమాధుర్యాలమీద నిర్లక్ష్యతకు కారణమైంది. మొదటినుంచీ తను ఎదుర్కొని కష్టాలతో యెప్పటికప్పుడు విసుగుచెందుతూ నేవున్నాడు. సౌఖ్యాన్ని గూర్చిన ఆలోచన తన కష్టాలసంఖ్యకు ఇంకొక్కటి కలుపుతుందేమోనని తన భయం !

మరికొన్నాళ్ళుగడచాక — తన కష్టాలకు సరైన ప్రతిఫలం కనిపించ నారంభించింది. యెంతో ఓర్పుతో జీవితాన్ని యెదుర్కొంటూన్న తన ఉద్యోగంలో ఒక్కో మెట్టుగా పైకి వెళ్తున్నాడు. ఇన్నాళ్ళూ తను యెందుకని మూఢుడై పెళ్ళిచేసుకోలేదని ఆలోచించాడు... ఒక రకమైన తృప్తికూడా లేకపోలేదు; తను బ్రహ్మచారిగా ఉండబట్టే — జీవితంలో తను యెన్నడూ తలవని యీ ఉన్నతోద్యోగానికి రాగలిగాడేమో ?

ఇప్పటికి తనకుకూడా స్వర్గసౌఖ్యం. దాంపత్యరేఖపట్టే అవకాశంవుందనే విషయాన్ని నమ్మటం మొదలుపెట్టాడు. తనకోసంగానే బతకటం యెంతకష్టం ! బావురుమనేఇంట్లో, గోడల్ని ఫర్నిచర్ని, ఒకమూల పట్టినబూజునూ — చీకట్లో తనతోపాటే కదిలే తననీడల్ని చూస్తూ ఎన్నాళ్ళని గడిపేట్టూ ? తనకు ప్రమోషన్ వొస్తే విని సంతోషించేవ్యక్తి కానీ, తనకేదన్నా కష్టంవొస్తే సానుభూతిగా నిట్టూర్చే (కనీసం అలా నటించే!) ఇంకో ప్రాణి కానీ లేదు. జీవితంలో ఇంతవరకూ గడిచివొచ్చిన సహారాలాటిదే ఇకముందున్న త్రోవకూడా అయితే — దాన్నికూడా గడవాల్సిన శ్రమకుగురికావటంకన్నా, ఆత్మహత్య చేసుకోవటం వెయ్యిరెట్లు మేలు!... స్నేహితులూ, గుమాస్తాలూ, సినిమాలూ, నాటకాలూ — ఇవేమీ తీర్చలేని ఆ ఒంటరితనం మాత్రం ఇక భరించేశక్తి తనలో లేదు.

కాస్త కాస్తగా ఉన్నతస్థానానికి వొస్తూన్నకొద్దీ తనకు సంబంధాలు రాసాగినయ్. అన్నీ గంతకుతగ్గ బొంతలుగా ఉండటంవల్ల తనేమీ చెయ్యలేక పోతూండేవాడు. క్రమంగా తన ఊహాలోకంలోంచి కిందికి దిగివొస్తూన్నా — తనకొక తృప్తికరమైన సంబంధం కుదరలేదు. కనీసం మనసుకన్నా తృప్తిలేకుండా — ఇష్టంలేని పెళ్ళిచేసుకొని — తరువాత ఇష్టతకోసం బలవంతంగా పాకులాడినా లాభంలేకపోవచ్చు. అందుకనే యీ విషయంలో పొరపాటుపడటంకన్నా, అసలు దానిజోలికి పోకుండా ఉండటం ఎన్నుకోదగ్గది !

ఆడపిల్లల తండ్రులు తనచుట్టూ తిరిగి తిరిగి విసుగెత్తారు. తనదృష్టిలో రత్నాల్లాటి తమకూతుళ్లను (ఒక్కదాన్నన్నా) వివాహమాడలేదని వాళ్ళకు కష్టంకలి

గింది. ఆ కడుపుమంటను వెళ్ళగక్కేందుకు 'ముప్ఫైఏళ్ళువొచ్చినా పెళ్ళి పెటాకులూ లేకుండావున్నాడు. ఎంత భాగ్యంఉంటే మాత్రం — ఎవరుచూసి సంతోషించనూ?...అసలు స్త్రీ అవసరమే లేదేమో? ... యీ మొహానికి పెళ్ళికూడా దేనికీ?" ఇలాటి మాటల్ని విరివిగా ప్రచారంచేశారు.

చూడగా చూడగా — తన పెళ్ళి విషయం, తనకన్నా లోకానికే ఎక్కువగా పట్టినట్టుతోచింది. లేకుంటే—తన వివాహవిషయం లోకానికి చర్చించే అవకాశంకానీ, విమర్శించే అధికారంకానీ లేదు. కనీసం వీళ్ళందరికోసమైనా తను పెళ్ళాడకతప్పదా?

మొదటినుంచీ కాస్త ఉన్నతాభిరుచులుగలవాడు కనుక, చవ్వన ఏ నీచ సౌఖ్యానికీ చెయ్యిజాపలేకపొయ్యాడు... కాని ఒంటరితనం మరీ దుర్భరమైనప్పుడు లోకంలోని ఇతరమానవు లెంతోమంది అనుభవించేసౌఖ్యం అర్థమౌతూన్నకొద్దీ, ప్రకృతిశాశించిన కామతృష్ణను చల్లార్చుకొని తీరవలసిన అవసరం వెన్నాడినప్పుడు — ఆ అవసరం భార్యద్వారా తీర్చుకునే అవకాశం ఏర్పడేవరకన్నా, బదులు సౌఖ్యంకోసం చెయ్యిజాపకతప్పలేదు. ఎన్ని ఉన్నతాదర్శాలున్నా, ఎంత మంచి అభిప్రాయాలున్నా తను కూడా ఒక మామూలుమానవుడు; తను నివశించేది ప్రస్తుతం మనమంతా నివశిస్తూన్న యీ భూలోకం. ఇక ఆచరణ విషయంలో ఒక సామాన్యమానవుడికన్న తనకేం ఎక్కువ అవకాశాలున్నయ్యనీ? అంతకన్నా గత్యంతరం లేకపోవటంవల్ల యెవరైనా చెయ్యగలిగినపని, చేసేపనినే సారధికూడా చేశాడంటే ఆశ్చర్యపడాల్సిందేమీలేదు.

ఇందులో యింకో తిరుగుడుకూడా వుంది. లోకం తనను అపార్థంచేసుకోసాగింది. తనలో అసలు స్త్రీ వాంఛ లేదన్న దుష్ప్రచారం ప్రారంభమైంది. ఆమాట చూచాయగా గ్రహించిన క్షణాన్నే—తన పురుషత్వాన్ని లోకానికి చాటవలసిన అవసరం ఏర్పడ్డది. తనను ఏపనికోసం లోకం ప్రోత్సహించి వెంటతరిమి బాధిస్తోందో (దాని పర్యవసానం లోకానికి తెలియకపోవటం శోచనీయం!) దేనికొరకై తనను ఛాలెంజి చేస్తూవుందో, ఆపని కాస్తా చేశాక కాని తనమంట సగం చల్లారలేదు......ముందెప్పుడో వివాహమాడేఅవకాశం ఏర్పడుతుందనే ఆశల్తో బతకటం అతనికి మరీ దుర్భరమనిపించింది. ఒట్టి ఆశల్తోనే ఎవరుమాత్రం ఎన్నాళ్ళు బతకగలుగుతారు?

దీనిఫలితంగా తను నీలవేణిస్నేహాన్ని సంపాయించగలిగాడు. స్త్రీతోడి స్నేహంకోసం (దాన్నే ప్రేమ అనీ, కామంఅనీ అనాలని మీకు వుంటే నాకేమీ అభ్యంతరంలేదు) పాకులాడే తనకు—తన ఆదర్శాలకు దగ్గర్లో వున్న స్త్రీ దొరకాలంటే — ఆ ప్రయత్నాలు చేసేందుకు తగినంత వ్యవధీ, ఓపికా తనకులేవు. అందుకనే, తేలిగ్గా — మామూలు బజారువస్తువును కొనుక్కొన్నట్లుగా వేశ్యఅయిన నీలవేణి స్నేహాన్నికూడా కొనుక్కున్నాడు. దొడ్లో కూరగాయలు ఉంటే బజారులో కొనుక్కునే అవ

సరం ఏముంటుందీ? అలాగే పనిగడుపుకునేందుగ్గాను యీపని చెయ్యాల్సి వొచ్చింది ... ఆమె వేశ్యఐతేమాత్రమేం? భార్యలేని లోటును ప్రస్తుతం ఆమె తీర్చగలుగుతుంది...తన పురుషత్వాన్ని లోకం ఇక అపార్థంచేసుకోలేదు.

—కాని తమాషాఏమిటంటే, ఇప్పుడు లోకం తనను స్త్రీవాంఛాహీనుడని అనటం మానేసింది. దానిస్థానే, వేశ్యవలలో చిక్కుకున్నాడనీ, మరి పెళ్ళెందుకనీ, ఇంతతక్కువ అభిరుచులున్న మనిషేమా అనీ — ఇలాంటి విమర్శల్ని సాగించింది.

సారధికి ఆశ్చర్యంకలిగింది. తను ఒక ప్రమాదాన్నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించి, అంతకన్న పెద్దప్రమాదంలో పడ్డాడు.

ఇప్పటికి సారధికి జ్ఞానోదయమైంది. లోకాన్ని సంతోషపెట్టే నిమిత్తం ఏపని చేసినా దండగే! ఏలోకమైతే తన ఆనందానికి అణాచందాకూడా యివ్వకుండానే, యీ అనవసరపు వ్యాఖ్యానాలు చేస్తుంటుందో, ఆలోకానికి భయపడుతూ తన ఆనందానికి నీళ్ళు ధారవొదులుకోవటంకన్నా బుద్ధితక్కువపని లేదు. ఇక్కడ చిన్నప్పుడు చదువుకున్న — గాడిదా, ముసలివాడూ, వాడి కొడుకూ — ఆకథ గుర్తుకొచ్చింది. లోకం ముఖంలోనవ్వి తన పనిని నిరాటంకంగా సాగించటమే ఎన్నుకోదగ్గది! యెన్నో దాంపత్యాలకన్నా, నీలవేణితో తను సాగిస్తున్న సంఘం ఒప్పని యీ దాంపత్యమే అనేకరెట్లు నయమన్న సంగతిని ఆలోచించేందుకు మాత్రం లోకం ఒక్క క్షణంకూడా ఆగదు...

ఒకటిమాత్రం నిజం; తనకు ఇష్టంఉండి కానీ, తన అభిరుచులు తక్కువజాతికి చెందినవని కానీ, యీ నీలవేణిని తను ఆశ్రయించలేదు. అంతకన్న మంచివాళ్లు — ఏకులకాంతన్నా ఉల్లాసంగా లభ్యమయ్యేపక్షంలో — యీ నీలవేణి ఎవడికి కావాలీ? అలాంటిఛాన్సు ఏదైనా తనకు దొరికితేనే కాని, తన అభిరుచిని పూర్తిగా లోకానికి తెలియజెప్పే అవకాశం ఏర్పడదు.

ఆరు నెలలు తిరిగేటప్పటికి ఈఉంపుడుకత్తె వ్యవహారంకూడా నసాళంఅంటింది. తను ఆమెకు సగంజీతాన్ని ధారపోస్తున్నాడని కాదు — భార్యకైతేమాత్రం యేమీ ఖర్చుకాకుండా వుంటుందా? భార్యకైతేమాత్రం బజారులో ఏవస్తువు తక్కువధరకు దొరుకుతుంది కనుకా? ప్రణయకథల అమూల్యభావాలూ, అద్భుతఆశయాలూ నీలవేణివల్ల తీరటం లేదనీ కాదు. కేవలం—తనకొక భార్య లోకంలో ఇతర భార్యల్లాంటిది—ఉంటే చాలనిపించింది. ఒక పరాయివస్తువును వాడుకుంటూన్నదానికీ, స్వంతవస్తువును వాడుకునేప్పుడు ఉండే తృప్తికీ, ఉండే భేదంలాంటిది! లోకందృష్టిలోలాగే, తన దృష్టిలోకూడా లోకానికి అత్యున్నతస్థానంలేదు (తనుకూడా, తను అనే లోకంలోని ఒక మనిషేగా!) ముఖ్యస్నేహితులందరూ తనను పెళ్ళిచేసుకోమనే సలహాలివ్వటం మరీ ఎక్కువైంది. నీలవేణి మైకంలో తను నిజంగానే పొరపాటు పడుతూ ఇలాగే సాగిపోతున్నా

డేమోననిపించింది. పెళ్ళంటే యేమిటో తెలియని తనజీవితానికి అదొక్కటే గొప్పలోటనిపించింది.

యీ ఊహ బాగా పునాదులు వేసుకునేప్పటికి సారథివయస్సు ముప్ఫైరెండేళ్ళు. అద్దంలో చూసుకున్నప్పుడు 'ఇంత ముదురుబ్రహ్మచారిని; నా కెవరు పిల్లనిస్తారూ?' అనిపించేది. సమయమంతా మించిపోయినట్టు తోచేది. చేతులారా అనేకరసమయఘట్టాల్ని నాశనం చేసుకున్నట్టు (?) బాధపడేవాడు. యీ ఒక్కసత్యాన్ని గ్రహించేందుకు ముప్ఫైరెండేళ్ళు !

తన ప్రస్తుతపరిస్థితిని చూసి తనకు పిల్లనిచ్చేవాళ్ళు లేకపోలేదు కాని, ఆ పిల్లలందరూ పదహారూ, పదిహేడేళ్ళలోపువాళ్ళు. యీడులో దాదాపు రెట్టింపు భేదాన్ని పెట్టుకొని, ఆ పిల్లల జీవితాల్ని నలిపెయ్యటానికి అతని మనసొప్పలేదు.

అదీకాక, కొంతకాలం మామూలుగా స్నేహంచేసి ఒకళ్ళ నొకళ్ళు అర్థంచేసుకుంటే సుఖపడొచ్చనే విషయంమీద అతనికి గాఢనమ్మకం. కాని యీ హిందూసమాజంలో—ఏతండ్రి;యీడులో వున్న తనకూతురితోడి ఏకాంత సంభాషణలకు ఒప్పుకొని, తనను నమ్మి ఆ వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ప్రకటించి తనకా మహదవకాశాన్ని కల్పిస్తాడు?... ఏమైనా నిలవేణీస్నేహాన్ని వొదిలించుకొని పెళ్ళిప్రయత్నాలు స్వయంగా చేయాలనుకున్నాడు. ఏడ్పులూ, ఊరడింపులూ, మంగళహారతులూ మొదలైనవన్నీ సక్రమంగా జరిగాక కాని ఆమె వొదలలేదు; చేసుకున్న భార్య కాకపోవటంవల్ల అంత పెద్దకష్టమనిపించలేదు.

## 2

ఇలాగే బాధపడుతూన్న సమయంలో అతనికి సత్యవతి పరిచయమైంది. తను ఇల్లుమార్చి వాళ్ళింట్లో అద్దెకు ఉండటమే తనకు పట్టబోయ్యే అదృష్టానికి (?) పునాది. తనలాగే ఆమెకూడా ఇరవైఏడేళ్ళదాకా పెళ్ళిచేసుకోకుండా ఉండిపోయింది. మొట్టమొదటిసారి తను ఆమెను చూసినప్పుడే—తనకోసమే, తనలాగే ఆమెకూడా వివాహ మాడకుండా జీవితంలో వేచి కూర్చున్నదేమో ననిపించింది.

ఆమె బాగా చదువుకున్నది. అందమైనది. మంచి సంగీతం పాడుతుంది. మంచి నాగరికతకు (కనీసం తన అభిరుచులకు తగ్గది !) అలవాటు పడ్డమనిషి. సన్నగా, నాజూగ్గా, పొడుగ్గా వుంటుంది... మెరిసే కళ్లనుంచి విజ్ఞానకాంతులు వెలికి ఉరుకుతూంటవి. ఎంతో ఉత్సాహంగా, జీవితమంటే ఆనందమే నన్నట్టుగా నవ్వుతూ ఉంటుంది...... ఒక్క మాటలో ఆమె తన స్వాప్నికసుందరి !......... యీమెతోడి దాంపత్యంలో స్వర్గసౌఖ్యం ఇమిడివుందని తను గాఢంగా నమ్మాడు. ఆమె ఉన్నతభావాలూ, విశాలహృదయమూ, మనిషిని అర్థంచేసుకోగల మనస్సూ తనకు ఎంతో నచ్చినయ్; లేకుంటే, ప్రస్తుతం పరపురుషుడైన తనతో ఇంతచనువుగా తన కుటుంబంలోని ఒక ముఖ్యబంధువుడల్లే చొరవగా

మాట్లాడుతూంటుంది ! (ఇలాగే ఇతర యువకులకూ ఇలాటి అవకాశాన్ని ఇచ్చివుంటుందేమోనన్న అనుమానం సారధికి ఎన్నడూ కలగకపోవటం నా తప్పుకాదు !) ఆమెతోపాటే, ఆమె ముసలితండ్రి భావాలుకూడా ఆకాశంలోనే విహరిస్తూండటం వల్ల—సారధికి మొత్తం కుటుంబమే (వాళ్ళ స్వంత మేడను తను ఎంత మెచ్చుకున్నా దానికన్న కూడా) నచ్చింది. ఆమె ఆర్థిక పరిస్థితి కూడా విచారించ దగ్గదే! అరలక్ష ఆస్థికి ఆమె ఒక్కతే వారసురాలు కావటంవల్ల — నీచాభిప్రాయాలకూ; సామాన్య మానవుల తక్కువరకం అభిరుచులకూ ఆమె యెప్పుడూ లొంగదు.

వారంరోజులు తిరక్కుండానే తన అభిప్రాయాలకూ, ఆమె అభిప్రాయాలకూ చాలా సామ్యం వుందనే విషయాన్ని గ్రహించాడు. అందులోనూ మొట్టమొదటి చూపులనుంచీ 'ఇంప్రెస్' ఐనవాడు: అలాటి విషయాల్ని గ్రహించేందుకు యెక్కువ కాలాన్ని వృథా చేయనక్కరలేదు. ఈమెను భార్యగా చేసుకోవాలనే నిశ్చయం అధికమైంది. ఆమె ప్రణయ భిక్ష కోసం వెంట బడ్డాడు_ముందు ఆమెను ఒప్పించి, తరువాత ఆమె తండ్రిని అడిగి చూద్దామని. యెందుకంటే, తనకు తెలిసినంత వరకూ తన వివాహ విషయంలో సత్యవతికి పూర్తిస్వాతంత్ర్యం వుంది.

హృదయమారా ప్రేమించిన పురుషుడు చేసే ప్రతిపనీ చేశాడు. (కాలేజి స్టూడెంటు కాకపోవటంవల్ల ప్రణయ లేఖలు రాయటమూ భావకవి కాకపోవటంవల్ల కావ్యాలు రాయటమూ తప్ప) .. ఆ దృశ్యాలు చూస్తేమాత్రం ఆమెనిజంగా అతని భార్యేననిపించింది. ఆమెమాత్రం అతను ప్రకటించే అనురాగాన్ని చూసి ఊరుకునేది. తనను మోసగించేందుకే అతను యీ పనులన్నీ చేస్తున్నాడన్నట్టు కనిపించేది ఆమె ప్రవర్తన... లేక ఇలాటి దృశ్యాలకు ఆమె బాగా అలవాటు పడన్నా ఉండాలి. సారధిమాత్రం మోతాదు చాలదేమోననే అనుమానానికి గురవుతూ ఇలాగే ముందుకు సాగిపోవటం కన్నా మరి గత్యంతరం లేదనుకుంటూండేవాడు.

కాని ఓర్పుకు కూడా ఒక పరిమితి వుంది. ఎంతకాలమని యీ సేవలు చేసేట్టూ? ఇలా సేవలు చేయించుకోవటం ఆమెకు సరదా ఐతే. తనభార్య అయాక వాటిని మళ్లీ మొదలు పెట్టి, ఆమెసరదాను భర్తవిధిగా తీసుకొని సాగించవచ్చు. తపస్సుకు కూర్చున్నవాడికూడా విసుగు పుట్టక తప్పదాయె. ఇప్పటికేచాలాకాలం వృథాపోయిందని విచారపడేవాడికి, యీ విధంగా ఒట్టిఆశలతో మరికొంతకాలం వృథాపోతుంటే ఆ విచారం ద్విగుణీకృతం కాక తప్పలేదు.

తన ప్రశ్నలకు ఆమె ఎప్పుడూ సరైన జవాబు చెప్పలేదు. ఆ మాటలు తప్పించి ఊరుకొనేది. విషయం ఇంకా పరిపక్వం కాలేదేమోనని తనుకూడాపస్తాయించేవాడు - ఎందుకంటే ఆపరిపక్వ ఫలం ఎందుకూ పనికిరాకుండా పోతుందనే భయమొకటి ఏడ్చిందిగా!... రాను రాను అసలు ఆఫలం పరిపక్వం కాదేమో

నన్నంత అనుమానాని కూడా గురి చేసింది.

ఆమెను పూజించటం మొదలుపెట్టి ఇప్పటికి నాలుగు నెలలు — నూటఇరువై రోజులు!_దాదాపు మూడు వేలగంటలు!_ (నిద్రలో కూడా ఆమె ధ్యాసే కనుక, మొత్తం కాలాన్నంతా లెక్క వేసుకో వాల్సిందే!, .. అసలు జీవితం మొట్టమొదటి నుంచీ ఇప్పటివరకూ తన కాలాన్నంతటిన్నీ ఆమె కోసమే వృథా చేసినంత భారంగా తోచింది. తన మనశ్శాంతిని పూర్తిగా భగ్నపరుస్తూన్న యీ విషయాన్ని ఇంకా పాతరెయ్యటంవల్ల లాభంలేదని తేల్చుకున్నాడు. యీరకం ఎండమావు ఆశల్తో, మోసంతో తను ఇక బాధపడలేడు. యీ డొంకతిరుగుడు మార్గాలన్నీ వొదిలి, ముసుగులో గుద్దులాట వ్యవహారాన్ని బైటికిలాగి, ఐసా పైసా తేల్చుకోవటానికి ధృఢనిశ్చయుడయాడు.

రంగానికి ఉపక్రమించి ఎలాగో ఆమెను సంభాషణలోకి దింపగలిగాడు.

“అసలు జీవితంలో నే వివాహ మాడవా?” అన్నాడు. ఆ సంగతి తేల్చుకుంటే, తననే కాకుండా తన వెనుకవాళ్లకు కూడా ఎంతో శ్రమను తగ్గించి పెడదామని!

“ఆ సంగతి నేనెలా చెప్పనూ? జీవిత మంతా యీ ఒక్కనాటితో నే అంత మవబోవటం లేదుగా?”

ఆమెలో కొంత తలబిరుసుతనం ఉన్నట్టు తను ఎరుగు; ఇంతవరకూ తను అలవాటుపడే ఉన్నాడు; ముందుముందు క్రమంగా దారికి లాక్కురాగలననే ధైర్యం అతనికివుంది. అందుకనే విసుగు లేకుండా తంటాలుపడుతూ వొచ్చాడు.

“ఏదో ఒకరకం అభిప్రాయంలేకుండా గుడ్డిగా నడవటంలో అర్థంవుండదు.”

“బహుశా చేసుకుంటానేమో?”

మొదటిసమస్య సగం కరిగిందనిపించింది

“ఎవర్నీ?” అన్నాడు, రెండో ప్రశ్నగా.

“నే నెలా చెప్పగలనూ? నన్ను హృదయపూర్వకంగా ప్రేమించేవాణ్ని”

దొరికిన కాస్త అవకాశాన్నీ ఉపయోగించుకు తీరాలనుకున్నాడు.

“నీకు తెలుసు... నాలుగు నెలలుగా నీ ప్రణయభిక్షకోసం నీముందు మోకరించి ఉన్నానని—”

“నువ్వా?” అందామె, ఆ విషయాన్ని కొత్తగా వింటున్నట్టు.

అతనికి కోపంవచ్చింది. యిన్నాళ్ళ నుంచీ తనుపడ్డకష్టమంతా వృథా ఐపోయిందనీ, తన మనస్సును ఇన్నాళ్ళుగా ఆమెకు అర్థంచేయలేక పోయాననీ_అంత కన్నా — ఆమె అర్థంచేసుకునేందుకు ఎందుకు ప్రయత్నించలేదా అనీను. కోపాన్ని ప్రకటించటంవల్ల అసలుకే మోసంవస్తుందేమోనని తమాయించుకున్నాడు.

అన్నాడు; “ఇందులో ఆశ్చర్యానికి తావేమీలేదు సతీ! అలావున్నట్టయితే నువ్వు గొప్పపొరపాటుచేస్తున్నావనేందుకు సందేహంలేదు.”

“సరేలే... ఆసంగతిపోనీ... కాని...”

తెలిసివుండే తెలియనట్టు నటిస్తోందని అతనికి తెలిసిపోయింది. యీ సమ

యాన్ని పోనిస్తే మరిలాభంలేదని కూడా అర్థమైపోయింది.

“పోనిచ్చేందుకు వీల్లేదు...... నేను చెప్తున్నాను. నిన్ను పెళ్ళాడితే నాజీవితానికి మంచి భావివుంటుందనే నమ్మకం నాకువుంది...”

“భావేం ఖర్మం? పెద్దచెరువే!” అని ఆమె పేళనగా నవ్వి వూరుకుంది.

ఇంకే సమయంలోనైనా తను ఆ హాస్యాన్ని అనుభవించేవాడు. కాని ఇక్కడ పిల్లికి చెలగాటమూ, ఎలుక్క ప్రాణసంకటంగావుంది.

“వేళాకోళం కాదు సతీ! నేను జీవితంలో ఎవర్నన్నా ఆత్మశుద్ధిగా ప్రేమించివుంటే—నిన్నే!”

“ఐతే యీ ముప్పై రెండేళ్ళనుంచీ ఎవర్నీ ఎప్పుడూ ప్రేమించివుండలేదా?”

కాస్త దారికివొచ్చిందని నమ్మాడు—

“లేదు—ఆ సదవకాశం నాకెప్పుడూ కలగలేదు.”

“దీనిఅర్థం — నీకసలు ప్రేమఅంటే ఏమిటో తెలియదు. ముప్పై రెండేళ్ళనుంచీ కళ్ళుమూసుకొని కూర్చున్నవాడికి ప్రేమంటే అర్థంకాకపోతే—మరికొంత కాలం ప్రయత్నించాల్సి వుంటుంది. ఇక అవకాశాలంటావా—పైన ఆకాశం ఎప్పుడూ నిశ్చలంగా ఎలావుందో—కింద యీ భూమిమీద అవకాశాలు కూడా ఎప్పుడూ వుండనే వున్నవి—”

యీరకం విమర్శన అతన్ని మరీ రెచ్చకొట్టింది... కాని నిలవతొక్కుకున్నాడు—అవసరంకొద్దీ.

“నన్ను అపార్థం చేసుకోవోక. హృదయం విప్పి మాట్లాడే మాటల్ని పేళన చేయవోక” అన్నాడు.

“నీ కసలు ప్రేమంటే తెలియక పోవటం నిజం; నిజంమాట్లాడుతేనిష్ఠూరమా?”

“నేనంటే నీ కసలు ఇష్టమేనా?” అన్నాడు, సంభాషణను ఇంకో మార్గానికి లాగుతూ.

“ఇష్టమైతేమాత్రం ఏంలాభం? ప్రేమ లేకపోయ్యాక?”

ఇష్టానికీ ప్రేమకూ ఎంతదూరగమో సారథికి జీవితంలోనే ఎదురవని సమస్య. ‘నాకు మైసూర్‌పాక్ అంటేఇష్టం’ అనే దాన్ని ‘మైసూర్‌పాకును నేను ప్రేమిస్తున్నాను’ అనటం తప్పని తెలుసు కనుక—రెండూ ఒకటి కాదని మాత్రం అర్థమైంది. సంభాషణ ఇరుకునపడ్డది. ఇక ఆమె చేతనే మాట్లాడించటం తనకు శ్రేయస్కరమని తోచింది—

“అసలు ప్రేమఅంటే నీ ఉద్దేశం ఏమిటి?” అన్నాడు ఎదురు ప్రశ్న వేస్తూ.

“అగ్ని పరీక్షలకు నిలబడగలిగేది—”

“ఒప్పుకున్నాను. ఇన్నాళ్ళ నుంచీ నన్ను యీదృష్టితోనే పరీక్ష చేస్తూ ఉండి ఉంటావు. నీకు బహుశానచ్చిఉండను... అదంతా అలావుంచి, ఇప్పుడేం పరీక్ష పెడతావూ?”

“నేను పరీక్ష పెట్టేదేమిటి? నీకు నువ్వాయి రుజూచేసుకోవాలి”

“ఎట్లా? నువ్వేదన్నా పనిచెప్తే, నేను చెయ్యలేకపోతే అప్పుడూ...!”

“నీకర్థంకాలేదు. నాకోసం ఏదన్నా త్యాగం చెయ్యగలవా?”

“ఓ! ఎందుకు చెయ్యలేనూ? ఏదైనా చేస్తాను... ఆమాత్రం చెయ్యలేనంత—”

"నీ ఉద్యోగానికి రాజీనామా ఇస్తావా?"

"ఓ!" అన్నాడు తొందరగా, రెండో ప్రశ్నకు కాచుకు కూర్చున్న వాడల్లే గుడ్లు మిటకరించి.

"ఐతే ఇచ్చిరా... తరువాత చెప్తాను."

ఒక్క క్షణకాలం సారథిగుండె కాయ ఆగిపోయినట్లనిపించింది. తను పన్నెండేళ్లనుంచీ చెమటోడ్చి చేసుకుంటూన్న యీ ఉద్యోగాన్ని — నాలుగు నెలల క్రితమే జన్మించిన యీ ప్రేమకోసం బలిపెట్టటమా! తరువాత— ఇతర ఆస్తిపాస్థులేమీలేని తను ప్రణయభిక్షమా నేసి మామూలు భిక్షాటనానికి బయలుదేర వొద్దూ? ఏదో చేస్తానని మాటవరసకైతే అన్నాడు కాని, నిజంగానే చెయ్యమంటే ఒకవేళ చేసినా— తను ఫకీరు వేషంలో తయారయ్యాక చెప్తుందట!... ఇదా పరీక్ష!... అతని ముఖం పాలిపోయింది.

"ఏం — యీ పరీక్షకే తట్టుకోలేక పోయ్యావేం? మరి ప్రేమ అంటే అల్లాటప్పా గొంగోర అనుకున్నావా? చూడు— ఆ ఫొటో చూడు."

ఆమె చెప్పే ఫోటో ఒక యువకుడిది. చాలా రోజులనుంచీ చూస్తున్నాడు కాని. దాని వెనుక, తెల్లని గోడ ఉన్నదని మాత్రమే అతనికి తెలుసు. ఇప్పుడు ఆమె మాటల్ని పట్టి గోడవెనుక —దానికి సంబంధించిన ఒక కథకూడా ఉండి వుంటుందనే అనుమానం తోచింది.

అతని మౌనాన్ని లెక్కచెయ్యకుండా ఆమె మాట్లాడసాగింది—— "అతను నన్ను ప్రాణసమానంగా ప్రేమించాడు — ఒకప్పుడు..."

"నేనూ ప్రేమిస్తున్నానుగా? నా ఫొటో సంగతి అవతల పెట్టి— నాకు మాత్రం అలాటి గౌరవంలో సగభాగం ఎందుకు ఇవ్వవూ?" అన్నాడు కొత్త ఆశతో...

"నీ సంగతి తరువాత చూద్దాం... అసలు అతని సంగతివిను. కాలేజీలో చదువుకునేప్పుడు—అతను నువ్విప్పుడు కోరే ప్రణయ భిక్షకోసం నాలుగేళ్లు యాచించాడు. నీలాగు నాలుగు నెలలకే విసుగెత్తలేదు. అతను మాటిమాటికీ రాసే ప్రణయలేఖల్ని చదివి పాతభోషాణంలో వేసేదాన్ని. స్టోరురూంలో వున్న భోషాణమంతా ఆ సాహిత్యంతోనే నిండివుంది ... నాలుగేళ్ళు —" అని బొటనవేలు మడిచి ముంజేతిని చూపుతూ సాగించింది— "నాలుగేళ్ళకూ కూడా నేనేమీ సరైన జవాబు చెప్పలేదు; అసలు నీమాత్రం అవకాశంకూడా అతనికి ఇవ్వలేదు. తన ప్రేమను అంగీకరించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని కూడా ఉత్తరాలు రాశాడు......ఆ లేఖల్ని నేను నమ్మలేదు....చివరకు ఆ ప్రేమ విఫలమైనందుకు, రైలుకిందపడి ఆ ప్రేమకు తన ప్రాణాన్ని కానుకగా అర్పించాడు— ప్రేమ అంటే అదీ!"

ఐతే తనను ఉద్యోగానికి రాజీనామా ఇమ్మన్నది బుల్లిపరీక్షన్నమాట! లేకుంటే ప్రాణాన్నే వొదులుకో మనేది! ప్రాణం తనది కాదు కనుక దాన్ని ఏమైనా చెయ్యమంటుంది!— పోతే ఆ ప్రేమ బికారిగాడు చచ్చాడంటే వాడొక వెధవైఉండాలి. వాడు తన ప్రేమను సాధించలేక పోయ్యాడు; ఆ అపజయం

పొందేందుకు తనే లోకంలో మొదటివాడనుకొని ఉంటాడు. ఆ ప్రేమను తన ప్రాణాన్ని అర్పించి– గాని విలువను ఒక నిండు మానవప్రాణికి జతచేశాడు. బ్లాక్ మార్కెట్ రేటును సృష్టించాడన్న మాట! వాడెవడో చేశాడని తనను కూడా చెయ్యమనటంలో అర్థంలేదు... యీమెకు పిచ్చి యెక్కలేదుకదా!

"వాడి ప్రేమ తగలడ్డట్టేవుంది!" అన్నాడు కోపాన్ని వెళ్ళగక్కుతూ

"వాడే నిజంగా ప్రేమించాడని నీకు తోచటంలా?"

"పోనీ వాణ్నే పెళ్ళి చేసుకోలేక పొయ్యావా—నాకీ శ్రమంతా తప్పేది?"

"చచ్చిపొయ్యాడుగా-లేకపోతే..."

"ఆత్మహత్య చేసుకుంటానని ఉత్తరం రాసినప్పుడన్నా ఒప్పుకోకపొయ్యావా?"

"నేను అదంతా నిజమనుకున్నానా?"

"వాడు బతికి ఉండగా సూదిమోపే అవకాశాన్ని కూడా ఇవ్వలేదు, చచ్చాక ఎంతైనా ఇచ్చేందుకు సిద్ధపడ్డావన్న మాట! అంటే తీరా ప్రేమను రుజూ చేశాక విచారించావన్న మాట?"

"అన్నమాటేమిటీ—నిజంగానే విచారించాను."

"ఇంకేం వాడిదయ్యాన్నన్నా పెళ్ళాడి ఉండాల్సింది. నువ్వొక రాక్షసివి. వాడి ప్రేమ విలువనే కనుక నువ్వు నిజంగా గ్రహించేవుంటే — వాడు ఇచ్చుకున్న విలువనే నువ్వుకూడా ఇచ్చుకొని ఉండాల్సింది...అదంతా అలావుంచి, ఆ రకం ప్రేమ నాకు అక్కర్లేదు. ఒకవేళ నువ్వు చూపుతానంటే నాకేమీ అభ్యంతరం లేదు—ఎవరిమీదనైనాసరే. కాని ఒక్క సలహా — నీ ప్రేమను లోకానికి రుజూ చేసేందుకుగాను ప్రాణాన్నే అర్పిస్తున్నట్టు ముందుగానే ఒక ఉత్తరాన్ని రాసి వుంచటం–నీచుట్టు పక్కలవాళ్ళందరికీ క్షేమకరం... నీబుర్రలో ఆ పిచ్చివాడుకల్పించిన ప్రేమ విలువతోనే ప్రతి వాణ్నీ కొలుస్తూ నీ ఆదర్శాన్ని పాటించుకుపోతూండు... నీకూ, నీ ప్రేమకూ ఇదే చివరి సలాం!"

సారథి బైటపడ్డాడు. గొప్పబరువేదో తలమీంచి తొలిగిపోయినట్టనిపించింది... ప్రాణాంతకమైన యీ ప్రేమకన్నా, ఆ నీలవేణి చక్కగా నటించే ప్రేమే ఎన్నుకోదగ్గది. దాన్ని ఆశ్రయిస్తే కలిగే ఆనందానికి — కనీసం పందరెట్లు విచారమన్నా ఇక్కడ కలిగివుంటుంది...

—ఆ చీకట్లో నీలవేణి ఇల్లు వెతుక్కుంటూ సారథి చకచకా నడవసాగాడు.

